10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/18/2026 5:16 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
మంగళవారం 18 ఆగస్టు 2026 పేజీలు : 4



వివరాలు 2లో..

## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యానికి తావులేదు

### పునరావృత అర్జీలకు శాశ్వత పరిష్కారం
### గడువులోగా విచారణతో బాధితులకు న్యాయం
### చర్యల నివేదికలపై ప్రత్యేక పర్యవేక్షణ

ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు. అర్జీలు పునరావృతం కాకుండా సమస్య మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాపట్ల రక్షణ న్యూస్

## ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- పాలక మండలి ప్రమాణ స్వీకారం
- ఛైర్మన్‌గా మల్లేశ్వరరావు బాధ్యతలు
- సౌకర్యాల కల్పనకు ఎమ్మెల్యే సూచన

చావలి శ్రీ వాలేశ్వర స్వామి దేవాలయ నూతన పాలక మండలి ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సమష్టిగా కృషి చేయాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆకాంక్షించారు. నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

వేమూరు రక్షణ న్యూస్



వివరాలు 2లో..

## ప్రజా సంతృప్తే అధికారుల ప్రధాన లక్ష్యం

### అర్జీదారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలి
### అర్జీలపై నాణ్యతతో పరిష్కారం చూపాలి
### పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి

వివరాలు 2లో..



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి సమస్య మూలాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు.

బాపట్ల రక్షణ న్యూస్

## నగరంలో ప్లాస్టిక్‌కు ఇక నో ఛాన్స్

### నగర కమిషనర్ మయూర్ అశోక్
### నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు
### లైసెన్స్ రద్దు.. దుకాణాలు సీజ్
### ప్రతిరోజూ విస్తృత తనిఖీలు చేయాలి

గుంటూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని సోమవారం నుంచి కఠినంగా అమలు చేస్తున్నామని కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై జరిమానాలతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



వివరాలు 2లో..

గుంటూరు రక్షణ న్యూస్

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/18/2026 5:16 AM Page 2



# ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యానికి తావులేదు

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులతో చట్టపరిధిలో సమగ్రంగా విచారణ జరిపించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కేవలం అర్జీగా పరిగణించకుండా, సమస్య తీవ్రతను అర్థం చేసుకుని బాధితుడికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఒకసారి పరిష్కరించిన సమస్య మళ్లీ ఫిర్యాదుగా మారకుండా, భవిష్యత్తులో పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారించాలని, తీసుకున్న చర్యలను స్పష్టంగా నమోదు చేసి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ విభాగానికి నివేదిక పంపాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం, జాప్యం, నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ సీఐ కే.శ్రీనివాసరావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో ప్లాస్టిక్‌కు ఇక నో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

నగర కమిషనర్ ఆదేశాల మేరకు సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ ఆధ్వర్యంలో ప్రజారోగ్య అధికారులు పట్నం బజార్, లాలాపేట, కోరేటేపాడు, బృందావన్ గార్డెన్స్‌తో పాటు అన్ని వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు. 98 దుకాణాల్లో 42 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.27 వేల జరిమానా విధించారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గత నెల రోజులుగా ప్రజలకు అవగాహన కల్పించామని మయూర్ అశోక్ తెలిపారు. ఇకపై దుకాణాలు, వాణిజ్య సంస్థలు, వీధి వ్యాపారులు ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా జరిమానాలు విధిస్తామన్నారు. రెండుసార్లు జరిమానా విధించినా నిబంధనలు పాటించకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.వార్డు స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రతిరోజూ తయారీ యూనిట్లు, గోదాములు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజలు పర్యావరణహిత సంచులను వినియోగించాలని కోరారు. 120 మైక్రాన్లలోపు కవర్లు కనిపిస్తే నగరపాలక సంస్థ కాల్‌సెంటర్ 08632345103కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# ప్రజా సంతృప్తే అధికారుల ప్రధాన లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 145 మంది అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇన్‌చార్జి డీఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, జాయింట్ కలెక్టర్ భావన వశిష్టలతో కలిసి అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని సంబంధిత అధికారులు బాధ్యతగా స్వీకరించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్న అనంతరం పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యను పైపైగా పరిష్కరించకుండా, భవిష్యత్‌లో అదే అంశంపై మళ్లీ అర్జీ రావడానికి అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.అర్జీల పరిష్కారంలో వేగంతో పాటు నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం అందించడంతోనే ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. సమస్య పరిష్కార ప్రక్రియలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

**నాణ్యమైన సేవలకు డీఎస్ఓకు ప్రశంస**

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) జగన్మోహన్‌ను ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందించారు. తాను అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్ఓ జగన్మోహన్ తెలిపారు. పరిష్కార ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను పాటించడం వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ, డీపీఓ ఎల్.ప్రభాకర్‌రావు, సీపీఓ ఏఎస్.రాజు, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, గృహ నిర్మాణ సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరై పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై చర్చించారు.

# ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

మొదటి పేజీ తరువాయి

**వేమూరు రక్షణ న్యూస్**

చావలి గ్రామంలోని శ్రీ వాలేశ్వర స్వామి దేవాలయంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్‌గా లంకోజి మల్లేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు సభ్యులు కల్వపూడి పాపారావు, బౌతుల సునీత, గోపాలం సత్యనారాయణ, ఇనంపూడి సరస్వతి, మన్నెం కస్తూరి, బెల్లంకొండ నాంచారమ్మ, సోమరౌతు శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేశారు.అర్చకులు చావలి మణికంఠ ఎక్స్‌ఆఫీషియో సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. నూతన పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాలక మండలి సమన్వయంతో పనిచేస్తే ఆలయానికి మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూద స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



**బాపట్ల రక్షణ న్యూస్**


అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వేదులపల్లి ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బాపట్ల మండలం వేదులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టువర్టుపురం రెండో గ్యాంగ్‌లో అక్రమంగా జూదం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు.బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, డీఎస్పీ చంద్రమౌళి ఆదేశాల మేరకు సర్కిల్ సీఐ హరికృష్ణ నేతృత్వంలో చేపట్టిన ఈ దాడిలో జూదం ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.29,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదు:వేదులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అక్రమ జూదం, అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమ జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .జూద స్థావరంపై ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు వేగంగా స్పందించి దాడి నిర్వహించడం పట్ల స్థానికులు అభినందించారు.

# ప్రజలకు స్వచ్ఛ జలం అందించాలి

## ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

**బాపట్ల రక్షణ న్యూస్**

ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల రూరల్ మండలం నందిరాజు తోటలో లుక్క శ్రీనివాసరావు, నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నాగలక్ష్మి' శుద్ధ జల ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, నిరంతరం నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు ఎంతో కీలకమని, సేవా దృక్పథంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. 'నాగలక్ష్మి' శుద్ధ జల ప్లాంట్ నిర్వాహకులు



మెరుగైన సేవలందిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాత జయప్రకాష్ నారాయణ, కందుల బాలకోటేశ్వరరావు, పరిశా గోపి, జంపని చలమయ్య, బలగాని శ్రీను, అసగాని బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ స్టేషన్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణంలోని కర్లపాలెం రోడ్డులో మంతెన విజయ వర్మ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'భావపురి పెట్రో పార్క్' ఫిల్లింగ్ స్టేషన్‌ను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు వ్యాపారంలో అభివృద్ధి సాధించి విజయవంతంగా ముందుకు సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే ఆత్మీయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, అవసరమైన చర్యలు తీసు



కుంటామని హామీ ఇచ్చారు. మంతెన కరుణ్ రాజు, తాత జయప్రకాష్ నారాయణ, కందుల బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# బండ్లపాలెం కార్డన్ సెర్చ్ లో 29 వాహనాలు సీజ్

**చీరాల రక్షణ న్యూస్**



చీరాల పట్టణంలోని బండపాలెం ప్రాంతంలో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చీరాల వన్‌టౌన్ సీఐ జి. సోమశేఖర్, టూటౌన్ సీఐ ఎస్. శశికుమార్‌తో పాటు ఎస్ఐలు, సిబ్బంది కలిపి 30 మంది పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. సోదాల్లో భాగంగా ప్రతి ఇంటిని తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వాహనాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను కలిపి మొత్తం 29 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గంజాయిని కూకటివేళ్లతో పెకిలించి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహిస్తామన్నారు. గంజాయి క్రయవిక్రయాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు లేదా 112 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు.

# వెదురు సాగుకు ప్రాధాన్యం



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో వెదురు సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి, సాగు అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన జిల్లా వెదురు ఆర్థిక వ్యవస్థ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇతర జిల్లాల్లో అమలవుతున్న వెదురు సాగు విధానాలను పరిశీలించి, బాపట్ల జిల్లాలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు. వెదురు సాగు ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి సౌజన్య, డీఆర్‌డీఏ పీడీ సింగయ్య, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అమర సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం



**కర్లపాలెం రక్షణ న్యూస్**

కర్లపాలెం మండలం ఎట్రవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో చెరుకుపల్లి వెంకట సిరి విజన్ కేర్ క్లినిక్ వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మ 80 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. శుక్లాలు ఉన్నట్లు గుర్తించిన వారికి ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కార్పొరేట్ ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రెడ్డి సేవా మిత్ర గౌరవ అధ్యక్షులు చీరాల శ్రీనివాసరెడ్డి సూచించారు. కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర అధ్యక్షులు నంగు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కోశాధికారి ఆట్ల హరిబాబురెడ్డి, సిబ్బంది బక్క గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అఖండ ఫౌండేషన్ ద్వారా పేదలకు ఆపద్బాంధవ సాయం



**బాపట్ల రక్షణ న్యూస్**

ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ అఖండ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. కర్లపాలెం మండలం ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన శీలం సుబ్బారెడ్డి కొంతకాలంగా తీవ్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న అఖండ ఫౌండేషన్ స్పందించింది. ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ ఆదేశాల మేరకు ప్రతినిధి ఆట్ల హరిబాబురెడ్డి సోమవారం సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లి ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సాయం రాబోయే వైద్య ఖర్చులకు ఎంతో ఊరటనిస్తుందని బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న తోటి మనిషికి చేయూతనివ్వాలనే మానవతా దృక్పథంతో ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డబ్బులు లేక వైద్యం అందక ఏ నిరుపేద ప్రాణాలు కోల్పోకూడదన్నదే తమ లక్ష్యమన్నారు. తమ దృష్టికి వచ్చిన నిరుపేద రోగులు, ఆపదలో ఉన్న వారికి శక్తిమేర ఆర్థిక సాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. ఫౌండేషన్ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి ఆహ్వానం



బాపట్ల రక్షణ న్యూస్

రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు తెలిపారు. విజయలక్ష్మీపురంలోని రోటరీ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం కొనసాగుతుందని సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. డాక్టర్ నీలిమ ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్, డైట్ అండ్ న్యూట్రీషియన్, సుజోక్ థెరపీ తదితర సేవలను అందించనున్నట్లు తెలిపారు. మెడ, వెన్ను, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సయాటికా, ఆర్థ్రైటిస్, ఫ్రోజన్ షోల్డర్, ఒత్తిడి, నిద్రలేమి, జీర్ణ సంబంధ సమస్యలు, రుతుక్రమ అసౌకర్యాలు వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి ముందస్తు నమోదు, అపాయింట్‌మెంట్ తప్పనిసరని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేజండ్ల శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కోశాధికారి కోళ్లపూడి బాలాజీ, మెడికల్ క్యాంపు చైర్మన్ మల్లికార్జునరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డుతో గ్రామాలకు కొత్త కళ

చిన్నగంజాం రక్షణ న్యూస్



చిన్నగంజం మండలంలోని పెద్దగంజాం--కొత్తగొల్లపాలెం రహదారి తారు రోడ్డుతో అందుబాటులోకి వచ్చిం ది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.3.15 కోట్ల వ్యయంతో సు మారు 4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి. పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సభ నిర్వహించిన సందర్భంగా స్థానిక రహదారి సమస్యను ఎమ్మెల్యే ఏలూరి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెద్దగంజాం--రాజు బంగారుపాలెం, పెద్దగంజాం--కొత్తగొల్లపాలెం రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే యుద్ధ ప్రభావం కారణంగా పనులు కొంతకాలం ఆలస్యమయ్యాయి. ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవతో అధికారులను సమన్వయం చేసి పనులను వేగవంతం చేయడంతో రహదారి నిర్మాణం పూర్తయింది. కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డుతో గ్రామాలు ప్రధాన రహదారులకు అనుసంధానం కావడంతో ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. రహ దారి నిర్మాణం పూర్తికావడంపై చిన్నగంజాం మండల ప్రజలు హ ర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి చం ద్రబాబు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# కుటుంబ నియంత్రణ సేవలకు ప్రోత్సాహకాలు

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో సేవలందించిన లబ్ధిదారులు, వైద్యులకు నగదు పురస్కారాలను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులు, వైద్యులకు కలెక్టర్ నగదు బహుమతి చెక్కులను పంపిణీ చేశారు. కుటుంబ నియంత్రణపై అవగాహనతో ముందుకు వచ్చిన తల్లులు, వాసెక్టమీ చేయించుకున్న పురుషులు, ప్రసవం అనంతరం 48 గంటల్లోపు పీపీఐయూసీడీ సేవలను పొందిన బాలింతలకు ప్రోత్సాహక నగదు అందజేశారు. అలాగే వాసెక్టమీ, పీపీఐయూసీడీ సేవలను అత్యధికంగా అందించి జనాభా నియంత్రణ కార్యక్రమంలో విశేషంగా కృషి చేసిన వైద్యులకు నగదు



పురస్కారాలతో సత్కరించారు. కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, బాధ్యతాయుతమైన కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా పనిచేయాలి

### నగర కమిషనర్ మయూరి అశోక్...

గుంటూరు రక్షణ న్యూస్

ప్రజల నుంచి అందే ఫిర్యాదులను కేవలం పరిష్కరించినట్లు కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యల పరిష్కారంపై సంబంధిత విభాగాధిపతులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సమస్యల మూలాలను గుర్తించి, అవి మళ్లీ తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలని, సాంకేతిక




కారణాలతో సమస్య పరిష్కారం సాధ్యం కానప్పుడు ఆ విషయాన్ని స్పష్టంగా తెలియజేసి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. కార్యక్రమానికి మొత్తం 37 అర్జీలు అందగా, పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్‌కు 17, రెవెన్యూకు 8, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్‌కు 1, అకౌంట్స్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కిషోర్, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏఓ తిరుపతినాయుడు, మేనేజర్ బాలాజీబాషా పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారిగా జగన్‌మోహన్‌రావు



బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించినందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీఎస్ఓ) ఏ. జగన్‌మోహన్‌రావును ఉత్తమ జిల్లా అధికారిగా ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన కలిసి జగన్‌మోహన్‌రావును అభినందించి సత్కరించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించడంలో చూపిన చొరవను అధికారులు ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి, అర్జీదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

## భూములు ఆన్‌లైన్ చేయాలి



బల్లికురవ రక్షణ న్యూస్

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఎంపీడీవోలకు అందజేశారు. తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో రైతు భరోసా పథకం, బ్యాంకు రుణాలకు అనర్హులుగా మారుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన తమ భూములను ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయడం లేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, తంగిరాల వెంకటేశ్వర్లు, తోట తిరుపతిరావు, పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/18/2026 5:16 AM Page 5



# లక్ష్యసాధనకు పట్టుదలే కీలకం

## జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

**బాపట్ల రక్షణ న్యూస్**

జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించే క్రమంలో ఎక్కడా నిరుత్సాహపడకుండా నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ విద్యార్థులకు సూచించారు. చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందిన పోలీసు సిబ్బంది పిల్లలను సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన అభినందించారు. 2024--25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల జిల్లాకు చెందిన 24 మంది పోలీసు సిబ్బంది పిల్లలకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెల్ఫేర్ విభాగం నుంచి రూ.3.43 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. లక్ష్యం ఉన్నతంగా ఉండాలని, వైద్యం, ఇంజనీరింగ్, సైన్స్, సాఫ్ట్‌వేర్, సివిల్ సర్వీసెస్ తదితర రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ఉమామహేశ్వర్ సూచించారు. విజయం సాధించే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లకు నిరుత్సాహపడకుండా పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. స్కాలర్‌షిప్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, విద్యార్థుల కష్టం, ప్రతిభకు లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. మంచి




మార్కులు, మంచి ఉద్యోగం మాత్రమే విజయానికి కొలమానం కాదని, సమాజానికి, దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగడం ముఖ్యమని ఎస్పీ తెలిపారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, బాధ్యతలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎన్నో త్యాగాలు చేస్తూనే తమ పిల్లల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నారని, వారి పిల్లలు అన్ని రంగాల్లో రాణించడం పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 22ఎ దరఖాస్తులపై వేగం పెంచాలి




## కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల రక్షణ న్యూస్**

22ఎ భూములకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించి వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ అంశాల సమీక్షలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పం చాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. చీరాల మండలంలో ఓటర్ల సవరణకు సంబంధించిన నోటీసుల జారీ, హియరింగ్‌లో పెండింగ్ అధికంగా ఉన్నందున వాటిని వెంటనే పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డుల్లో 'ఇతరులు' నమోదు లేకుండా చూడాలని, వేమూరు మండలం అబ్బన్నగూడవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 164 సమస్యను పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్ఓఆర్ సర్వే ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్షించిన కలెక్టర్, నాలుగు అంశాల్లో వందశాతం ప్రతికూల ఫలితాలు వచ్చిన మండలాల వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్చూరు, చీరాల, వేమూరు మండలాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు అవసరమైన 50 సెంట్ల భూమిని గుర్తించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో జేసీ భావన వశిష్ట, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థికి కలెక్టర్ అభినందనలు



**బాపట్ల రక్షణ న్యూస్**

విద్యార్థులు స్పష్టమైన మూడు లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సంఖ్య కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యువ విజ్ఞాని కార్యక్రమం YUVIKA-2026కు ఎంపికైన బాపట్ల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి తామన్ శ్రీరామ్‌ను కలెక్టర్ అభినందించారు. తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌ను కలిసిన తామన్ శ్రీరామ్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇస్రో కార్యక్రమంలో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి తామన్ శ్రీరామ్‌కు అవకాశం లభించిందని, ఇస్రో ఎంపిక జాబితాలో 119వ స్థానంలో నిలిచారని తెలిపారు. మే 11 నుంచి 22 వరకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో నిర్వహించిన YUVIKA-2026లో విద్యార్థి పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కలెక్టర్ ఇచ్చిన సూచనలు, ప్రోత్సాహం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని తామన్ శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రతినిధులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## వృద్ధులకు బియ్యం పంపిణీ




**గురజాల రక్షణ న్యూస్**

గురజాల మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కీర్తిశేషులు తన్నేటి వెంకటేశ్వర్లు (అంబి) 11వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. ఆయన సతీమణి భ్రమరాంబ సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు 50 కిలోల బియ్యంతో పాటు పండ్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.